క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు పరిధిలోని మన్సూర్‌పూర్‌లో రూ.45లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనాసజీబ్ బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బుడ్డోళ్ల నర్సింహులు, నాయకులు రామకృష్ణ, అభిషేక్ షెట్కార్, తుకారాం పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న సంజీవరావు

జోగిపేట(అందోల్): సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర వైఎస్సార్‌టీపీ అధికార ప్రతినిధి సంజీవరావు డిమాండ్ చేశారు. బుధవారం జోగిపేటలోని వైఎస్సార్ విగ్రహం ఎదుట స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ దళితబంధు పథకాన్ని నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అర్హులైనవారికి అందజేయాలన్నారు. అర్హులైన వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లను మంజూరు చేయకుండా తమ సొంత పార్టీ వారికే ఇస్తున్నట్లు ఆరోపించారు. వైఎస్ షర్మిల నాయకత్వంలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా వైఎస్సార్‌టీపీని బలోపేతం చేస్తామని తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌టీపీ నాయకుడు రాకేష్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండల పరిధిలోని వల్లూరుకు చెందిన పారమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వైద్యఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.61,500 చెక్కును బుధవారం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో బాధితురాలి కుటుంబసభ్యులకు అందజేశారు. నాయకులు మాణిక్‌రెడ్డి పాల్గొన్నారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి



ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: పెరిగిన ధరలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలని కోరతూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మేడే సందర్భంగా కార్మికులకు రూ.1000 మాత్రమే పెంచి చేతులు దులుపుకోవడం విచారకరమన్నారు. ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కనీస వేతనం రూ.26వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సువర్ణ, ఎల్లమ్మ, నర్సింలు, రాజు, అంజి, వేణు, రాములు లక్ష్మి, సంగీత, ఎల్లమ్మ, రాము, కిరణ్, సత్యం పాల్గొన్నారు.

సరస్వతిదేవికి జెడ్పీటీసీ పూజలు



పూజలు చేస్తున్న జెడ్పీటీసీ మీనాక్షిసాయికుమార్

మునిపల్లి(అందోల్): జెడ్పీటీసీ మీనాక్షిసాయికుమార్ బుధవారం తన వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రాఘవపూర్‌లోని సరస్వతి గంగమాత దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రైతుబంధు మండల అధ్యక్షులు పరశురాంగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు మల్లారెడ్డి పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం



నేలరాలిన మామిడి కాయలు



కోహీర్‌లో నేలవాలిన మొక్కజొన్న పంట

- మార్చిలో కురిసిన వర్షాలకు 4,047, ఏప్రిల్ నెలాఖరులో కురిసిన వర్షాలకు 2,362 ఎకరాల్లో నష్టం
- ఆందోళనకు గురవుతున్న రైతులు
- ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు

జహీరాబాద్: అకాల వర్షాలకు యాసంగిలో పండించిన పంటలకు అపార నష్టం వాటిల్లింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. భారీగా కురిసిన వడగండ్లతో యాసంగి పంటలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. మార్చి 16,17 తేదీల్లో కురిసిన వడగండ్ల వానకు జిల్లాలో 4,047 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఏప్రిల్ 27 నుంచి 30వ తేదీ వరకు కురిసిన భారీ వర్షాలకు యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, తెల్లకుసుమ, శనగ పంటలతో పాటు బొప్పాయి, అరటి, టమాట, ఉల్లిగడ్డ, గోబి, క్యాబేజీ, వంకాయ తదితర కూరగాయలు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

6,409 ఎకరాల్లో పంట నష్టం

జిల్లాలో రెండు పర్యాయాలు కురిసిన అకాల వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా 6,409 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. మార్చిలో కురిసిన వర్షాలకు 4,047 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించగా గత నెల 27 నుంచి కురిసిన భారీ వడగళ్ల వర్షాలకు 2,362 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. రెండు పర్యాయాలు కురిసిన భారీ వర్షాలు జహీరాబాద్ డివిజన్‌పైనే అత్యధిక ప్రభావం చూపాయి. అపార నష్టం కూడా ఈ నియోజకవర్గంలోనే జరిగింది. మార్చి16, 17 తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు జహీరాబాద్ మండలంలో 374.24 ఎకరాల్లో, మొగుడంపల్లి మండలంలో 154.37 ఎకరాలు, కోహీర్ మండలంలో 1794.16 ఎకరాలు, ఝరాసంగం మండలంలో 451.11 ఎకరాలు, న్యాల్‌కల్ మండలంలో 206.06 ఎకరాలు, రాయికోడ్ మండలంలో 37.25 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. మునిపల్లి మండలంలో 95.23 ఎకరాలు, వట్‌పల్లి మండలంలో 2.15 ఎకరాలు, సదాశివపేట మండలంలో 183.01 ఎకరాలు, కంది మండలంలో 8.06 ఎకరాలు, అందోల్ మండలంలో 20.18 ఎకరాలు, కల్హేర్ మండలంలో 5 ఎకరాలు, కంగ్టి మండలంలో 341.18 ఎకరాలు, మనూర్ మండలంలో 26.38 ఎకరాలు, నాగల్‌గిద్ద మండలంలో 12.10 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు నిర్ధారించారు. ఒక్క జహీరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో అత్యధికంగా 2981 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. దీంతో 2112 మంది రైతులు నష్టపోయారు.

జహీరాబాద్‌పైనే ప్రభావం

ఏప్రిల్ 27 నుంచి 30వ తేదీ వరకు కురిసిన భారీ వర్షాలు జహీరాబాద్ ప్రాంతం పైనే అధికంగా ప్రభావం చూపింది. ఈ వర్షాలకు 2,362 ఎకరాల మేర పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఇందులో కోహీర్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోనే అధికంగా నష్టం వాటిల్లింది. ఈ మూడు మండలాల్లోనే 1,426 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. కోహీర్ మండలంలో 655 ఎకరాలు, జహీరాబాద్ మండలంలో 612 ఎకరాలు, మొగుడంపల్లి మండలంలో 159 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు.

రూ.10వేలు పరిహారం ప్రకటించిన ప్రభుత్వం

భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతాంగానికి ఆదుకునేందుకు ప్రభుత్వం పరిహారాన్ని ప్రకటించింది. ఎకరాకు రూ.10వేల వంతున పరిహారం ఇవ్వనున్నట్లు పేర్కొంది. అన్ని రకాల పంటలకు ఇంత మేర పరిహారాన్ని అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

పంట నష్టంపై నివేదించాం



జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలతో పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదికలు పంపాం. సాగులో ఉన్న అన్ని పంటలపై వర్షం ప్రభావం పడింది. మార్చిలో కురిసిన వర్షాలకు సంబంధించిన నష్టాన్ని గుర్తించి అప్పట్లోనే నివేదిక ఇచ్చాం. ఇటీవల కురిసిన వర్షాలతో పంట నష్టానికి సంబంధించి ప్రాథమిక అంచనా నివేదికను ఇచ్చాం. రైతులు ఆందోళన చెందవద్దు.

– నర్సింహారావు, జేడీఏ–సంగారెడ్డి

ఐక్యతకు ప్రతీక ఈద్ మిలాప్

ఎమ్మెల్యే మాణిక్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: ఐక్యతకు ప్రతీక ఈద్ మిలాప్ అని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో పట్టణంలోని లతీఫ్ రోడ్డులోని ఇస్లామిక్ సెంటర్‌లో బుధవారం ఈద్ మిలాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాణిక్‌రావు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణంలో అన్ని వర్గాల ప్రజలు కలసిమెలసి జీవిస్తుంటారని, ఈ ప్రాంతం శాంతికి నిలయమని తెలిపారు. జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా కుల,మతాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. జీకాట్ ఎండీ ఢిల్లీవసంత్ మాట్లాడుతూ ఈద్ మిలాప్ గంగా, జమున తెహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తోందని వివరించారు. జమాతే ఇస్లామీ హింద్ తెలంగాణ అధ్యక్షులు అమీర్ మౌలానా హమీద్ మహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ ఒకరిని మరొకరు గౌరవించుకుని ముందుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రంజోల్ మఠాధిపతి రాచయ్యస్వామి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మోహినోద్దీన్, నిర్వాహకులు ఇర్షాద్, జబ్బార్ పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి

నారాయణఖేడ్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్ స్పష్టం చేశారు. ఖేడ్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని జేపీఎస్‌లు చేపట్టిన సమ్మెను సురేశ్ షెట్కార్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేపీఎస్‌లతో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు సరికాదన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, నాయకులు తాహెర్, సాయిలు, శివకుమార్, సుభాష పటేల్ పాల్గొన్నారు. సమ్మె శిబిరాన్ని బుధవారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఆయన వెంట అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ రజినీకాంత్, సీనియర్ నాయకులు సాయిరాం, సంజీవ్‌పటేల్ పాల్గొన్నారు.



నారాయణఖేడ్: సమ్మె చేస్తున్న జేపీఎస్‌లకు సంఘీభావం ప్రకటిస్తున్న సురేశ్‌షెట్కార్



జహీరాబాద్ టౌన్: ప్రభుత్వానికి ట్వీట్ చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి ట్వీట్

జహీరాబాద్ టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె బుధవారంతో 6వ రోజుకు చేరుకుంది. జహీరాబాద్ డివిజన్‌లోని జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంఘం, కోహీర్ మండలాల కార్యదర్శులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులంతా ప్రభుత్వానికి ట్విటర్ ద్వారా టీట్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అదిత్యా, జిల్లా కార్యదర్శి నిషాపాటిల్, జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, రాయికోడ్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల అధ్యక్షులు బీరప్ప, నవీన్, మహేష్‌గౌడ్, రజనీకాంత్, నవీన్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కును పంపిణీ చేసున్న సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సీఎం కేసీఆర్ పేదలను ఆదుకుంటున్నారని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి చెప్పారు. మంగళవారం నర్సాపూర్, హత్నూర మండలాల్లోని పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

రైతులకు అండగా ఉంటాం

కొల్చారం(నర్సాపూర్): ప్రతి గింజను కొనుగోలు కేంద్రాల ద్వారా తూకం వేయించి, రైస్ మిల్లులకు రవాణా అయ్యే వరకు రైతులకు పూర్తి అండగా ఉంటామని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్ భరోసా ఇచ్చారు. బుధవారం మండలంలోని రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ అకాల వర్షాలతో పంట నష్టపోయిన వారికి ప్రభుత్వం ఇప్పటికే ఆదుకుంటామని భరోసా ఇచ్చిందన్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని.. ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయన వెంట సంఘం డైరెక్టర్లు, సీఈఓ నవీన్, సిబ్బంది ఉన్నారు.



ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న రమేశ్ కుమార్

పుస్తెమట్టెలు అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గుమ్మడిదల గ్రామానికి చెందిన దివ్య, బొంతపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి కుమార్తెల వివాహానికి చిట్కుల్ సర్పంచ్ నీలం మధు బుధవారం పుస్తెమట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా వారు నీలం మధుకు కృతజ్ఞతలు తెలిపారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం



కోహీర్: వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కోహీర్(జహీరాబాద్): మండల పరిధిలోని రాజనెల్లి గ్రామంలో సర్పంచ్ లచ్చమ్మ బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కంటివెలుగు శిబిరాన్ని 5 రోజుల పాటు నిర్వహించి అవసరమైనవారికి మందులు, కంటిఅద్దాలు ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నవీన్‌కుమార్, స్రవంతి, పంచాయతీ కార్యదర్శి ఆనంద్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల పరిధిలోని దామర్‌చెరువు చెందిన ఒంటరి మహిళలైన శికారి పోచవ్వ, మన్ను సత్యవ్వలకు పూటగడవడం కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేయిర్ ట్రస్టు చైర్మన్, కేంద్ర ఆహారసంస్థ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ బుధవారం గ్రామానికి వెళ్లి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంగమేష్, ట్రస్టు సభ్యులు నర్సింహ్మాగౌడ్, కృష్ణమూర్తి, అశోక్, కృష్ణాగౌడ్ పాల్గొన్నారు.

వర్షంనీటిని తొలగిస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

నారాయణఖేడ్: అకాలవర్షంతో కాలనీలలోకి చేరిన నీటిని తొలగిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనాసజీబ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో స్థానిక నాయకులు అభిషేక్ షెట్కార్, మూడ రామకృష్ణతో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ దశాబ్దాల క్రితం నిర్మించిన మురుగుకాల్వలు తక్కువ వెడల్పుతో నిర్మించినవి కావడంతో అవి నిండి మురుగునీరు ఇళ్లల్లోకి చేరుతోందన్నారు. సమస్యలను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని వార్డువాసులకు హామీనిచ్చారు.

ప్రతిఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలి



ఆలయంలో పూజలు చేస్తున్న దామోదర రాజనర్సింహ

వట్‌పల్లి(అందోల్): ప్రతిఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలని మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఖాదిరాబాద్ గ్రామంలో రుక్మిణీ విఠలేశ్వరస్వామి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్‌జ్యోషి, మాజీ స్కోర్ చైర్మన్ సంగమేశ్వర్, యువజన విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్, డాకూర్ మాజీ ఎంపీటీసీ రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పూజలు చేసిన బాబూమోహన్

రుక్మిణీ విఠలేశ్వర ఆలయ పునఃప్రతిష్ఠాపన ఉత్సవాల్లో మాజీ మంత్రి, బీజేపీ నేత బాబూమోహన్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనిల్, సుమన్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



శివంపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: చౌటకూర్ మండలంలోని శివంపేటలో డీసీసీబీ ఆధ్వర్యంలో బుధవారం వరి కోనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్‌పర్సన్ పల్లె సరోజసంజీవయ్య, ఏడీ అరుణ, ఏఓ చైతన్య, అధికారులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర చేనేత సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కుమారుడు చింతా సాయినాథ్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొల్కూర్, పెద్దాపూర్ గ్రామాల్లో బుధవారం వరి కొనుగోలు కేంద్రాలను రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు అమరేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులకు సౌకర్యంగా, అందుబాటులో ఉండేలా గ్రామంలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు దళారులకు అమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొను గోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని అమ్మి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యాదమ్మ కిష్టయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజన్న, నాయకులు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొలకలొస్తున్న ధాన్యం



తిమ్మాపూర్‌లో మొలకలు వచ్చిన ధాన్యం

కౌడిపల్లి(నర్సాపూర్): తడిసిన ధాన్యం మొలకలు వస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దీంతో ప్రభుత్వం ఇటీవల మండలంలోని వివిధ గ్రామాల్లో 29 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారభించింది. అయినప్పటికీ కొనుగోలు మాత్రం పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు. వర్షంతో ధాన్యం తడిసిపోవడం.. రైతులు ఆరబెట్టడంతోనే సరిపోతుంది. పగలు ఆరబెట్టడం రాత్రి వర్షంతో తడిసిపోవడంతో అడుగున ఉన్న ధాన్యం మొలకలు వస్తుంది. త్వరగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నాయి.

◆ **పంట నష్టం వివరాల సేకరణ**

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతుల వివరాలను వ్యవసాయ అధికారులు సేకరిస్తున్నారు. బుధవారం గోపని వెంకటాపూర్, వీరోజిపల్లి తదితర గ్రామాల్లో ఏఈఓలు స్వాతి, మమతలు క్షేత్రస్థాయిలో వివరాలను సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

అర్హులు కంటి పరీక్షలు చేయించుకోవాలి



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండలంలోని రాజిపేటలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వైద్య శిబిరంలో ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు అద్దాలు పంపిణీ చేస్తారని, అవసరం ఉన్న వారికి ఆపరేషన్లు సైతం చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగంగౌడ్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు సార రామాగౌడ్, ఉపసర్పంచ్ మాదవి శివ, సొసైటీ డైరెక్టర్ మల్లేశం, డాక్టర్ శివ, ఏఎన్‌ఎం రేణుక, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్‌లో తిప్పలెన్నో...

టాయిలెట్స్ లేక రైతులు, ప్రజలకు తప్పని ఇబ్బందులు



తహసీల్దార్ కార్యాలయం

నర్సాపూర్: తహసీల్దార్ కార్యాలయం వద్ద కనీస వసతులు లేక కార్యాలయానికి ఆయా పనుల కోసం వచ్చే ప్రజలతో పాటు ధరణి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్ కోసం వచ్చే రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో రోజు పదుల సంఖ్యలో రైతులు వస్తున్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఒకే రోజు ఎక్కువ మంది స్లాట్ బుక్ చేసినప్పుడు, తమ వంతు వచ్చే వరకు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. కాగా కార్యాలయంలో టాయిలెట్స్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్లు , ఇతర పనుల నిమిత్తం ఆఫీసుకు వచ్చే మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఆంజనేయులును వివరణ కోరగా తమ కార్యాలయానికి సొంత భవనం లేదని, ఇతర శాఖకు చెందిన భవనాన్ని వినియోగిస్తున్నామన్నారు. రెండు టాయిలెట్స్ ఉన్నాయని, ఒకటి సిబ్బంది వినియోగిస్తుండగా, మరో దానిని ఆఫీసుకు వచ్చే ప్రజలు వాడుకుంటున్నారన్నారు. ఇంకో టాయిలెట్ నిర్మించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతానన్నారు.